# కులగణన- ఆవశ్యకత-ప్రభుత్వ సంకల్పం

- దేశమంటే మట్టికాదోయ్.....దేశమంటే మనుషులోయ్. అన్నారు మహాకవి గురజాడ. దీని అర్ధం దేశమంటే ప్రజలు అని.

- ప్రభుత్వాలు ప్రజల యొక్క సంక్షేమం కొరకు మరియు అభివృద్ధి కొరకు పనిచేయాలి కాబట్టి, దేశంలో ఎంతమంది ప్రజలు ఉన్నారు అన్న విషయం తెలుసుకొనుటకు జనగణన (సెన్సస్ ) చేపట్టడం ప్రపంచంలోని అన్ని దేశాలలో లాగే మన దేశంలో కూడా జరుగుతున్నది.

- మన దేశ సామాజిక పరిస్థితులు ప్రపంచంలోనే భిన్నమైనవి. కుల ప్రాతిపదికన సమాజంలో అసమానతలను వ్యవస్థీకృతం చేయడం జరిగినది. కనుక, జనాభా గణనతో పాటు కుల గణన కూడా చేపట్టవల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

- భారత దేశంలో 1872లో తొలిసారిగా ప్రారంభమైన జనగణన, ఆ తర్వాత ప్రతి పదేళ్ళకు చేపట్టడం జరుగుచున్నది. ఇందులో భాగంగానే కులగణన యధావిదిగా జరిగేది.

- చివరిసారిగా పూర్తిస్థాయిలో 1931లో కులగణనతో కూడిన జనగణన జరిగింది. ఆ తర్వాత 1941లో జనగణన చేపట్టినప్పటికీ, ఆ సమయంలో జరిగిన రెండవ ప్రపంచ యుద్ధ పరిస్థితుల నేపధ్యంలో జనగణన పూర్తి స్థాయిలో చేపట్టబడలేదు. అంటే, కులగణన జరగలేదు.

- ఆ తర్వాత, స్వాతంత్ర్యానంతరం 1951 నుండి జరిగిన ఏ జనగణనలోనూ, పూర్తి స్థాయిలో కులగణన చేయడం లేదు. అనగా ఎస్సీ, ఎస్టీలను మినహాయించి మిగిలిన వారి గణన కులాల వారీగా చేయడం లేదు. మిగిలిన వారందరినీ, జనరల్ కేటగిరి క్రింద గంపగుత్తగా నమోదు చేయడం జరుగుతున్నది.

- ప్రస్తుతం మనం 2023 సంవత్సరంలో వున్నాము. అంటే, పూర్తి స్థాయిలో కులగణన చేపట్టి 92 సంవత్సరాలు నిండాయన్నమాట. ఇది రమారమి ఒక శతాబ్ది కాలానికి సమానం.

- 1931లో చివరిసారిగా కులగణన జరిగిన నాటికి మన దేశ జనాభా కేవలం 30 కోట్లు మాత్రమే. కానీ, ఈనాడు మన జనాభా 140 కోట్లు. అంటే, నాలుగురెట్ల కంటే ఎక్కువగా పెరిగిందన్నమాట. మరియు, ఈనాటి పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాలు ఆనాటి మన దేశంలో భాగమే.కానీ, నేడు అవి వేరుపడిస్వతంత్ర్య దేశాలయ్యాయి.

- కుల గణన చేయని కారణంగా, జనాభా సాధారణ వృద్ధి రేటును ప్రాతిపదికగా తీసుకుని వివిధ కులాల జనాభాను రమారమిగాలెక్కిస్తున్నారు. కానీ,జనాభావృద్ధిరేటు అన్ని మతాలలో, అన్ని కులాలలో, అన్ని వర్గాలలో, అన్ని ప్రాంతాలలో ఒకే తీరుగా వుండదన్నది జగమెరిగిన సత్యం. కనుక, జనాభా సాధారణ వృద్ధి రేటు ప్రకారం చేయబడే లెక్కలు సరియైనవి కావని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

## కులగణన ఎందుకు చెయ్యాలంటే......

- ✓ కులాలవారీ జనాభా మరియు వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి.

- ✓ సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి మరియు అత్యంత ఉపయోగకరమైన పధకాలు రూపకల్పన చేయడానికి

- ✓ నిజమైన అర్హత కలిగివుండి, సంక్షేమ/ అభివృద్ధి ఫలాలు అందని వారిని గుర్తించి, వారికి లబ్ది చేకూర్చడానికి

- ✓ సామాజిక న్యాయాన్ని సాధించి, సమసమాజాన్ని స్థాపించడానికి.

## మన ప్రభుత్వ సంకల్పం .....

- ఈ ప్రభుత్వం సామాజిక న్యాయం కొరకు కట్టుబడి యున్నది. అందుకనే, సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల కొరకు ఎన్నో వినూత్న పధకాలను ముఖ్యంగా సంక్షేమ పధకాలను అమలు చేస్తూ... దేశానికే ఆదర్శప్రాయమైంది.

- అలాగే, సమాజంలో బలహీన వర్గాలుగా పరిగణించబడుతున్న వెనుకబడిన తరగతులను సమాజానికి వెన్నెముక తరగతులుగా ఈ ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమం మరియు అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టి పెట్టింది.

- దాదాపు, శతాబ్ద కాలంగా కులగణన చేయకపోవడంతో అభివృద్ధి ఫలాలను అందుకోవలసినంతగా అందుకోలేక పోయామని, అభివృద్ధిలో వెనకబడ్డామని భావిస్తున్న వెనుకబడిన తరగతుల వారినుండి కులగణన చేయాలన్న డిమాండు చాలా కాలంగా వస్తున్నది. కానీ, గత ప్రభుత్వాలు దీన్ని పెడచెవిన పెట్టాయి. వారి డిమాండు సహేతుకమైనదని భావించి, ఈ ప్రభుత్వం కులగణన దిశగా ముందడుగు వేస్తున్నది.

- కుల గణన కొరకు, మన ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన గ్రామ సచివాలయాలు, గ్రామ వాలంటీర్ల వ్యవస్థను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమైనది.

- తద్వారా సమాజంలోని అన్ని కులాలు, వర్గాల వారికి అభివృద్ధి ఫలాలు దామాషా పద్దతిలో అందుతాయన్న నమ్మకం ఏర్పడడానికి, అభివృద్ధిలో వారికి దీటైన భాగస్వామ్యం ఉంటుందన్న భరోసా కల్పించడానికి, వారి ఆత్మవిశ్వాసం మరింతగా పెరగడానికి దోహదపడి, సమాజంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి యొక్క ఆర్ధిక, విద్య, సామాజిక, రాజకీయ ఎదుగుదలకు పునాది వేస్తుందని ఈ ప్రభుత్వం ప్రగాఢంగా విశ్వసిస్తోంది.

****